W W W.EPAPER.MAHADAILY.COM

ANN తెలుగు

# మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

11-10-2025



మెయిన్‌లో..

## దక్షిణ అయోధ్యకు నూతనశోభ

దక్షిణ అయోధ్య భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకొనుందని ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పనులు శరవేగంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పాటు ఆలయ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఆయన మాటల్లో ఇలా....



07

## ఘోర రోడ్డు ప్రమాదం

సాయంత్రం సంధ్య వేళలో పిక్నిక్ అని ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి ఖమ్మం బయలుదేరిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు,పాప మృతి చెందగా ఒకరు గాయాలపాలైన సంఘటన మండల పరిధిలో పెద్దమండవ రహదారిలో శుక్రవారం రాత్రి జరిగింది.



07

మణుగూరులోని ఇసుక ర్యాంపు

# పెట్రేగిపోతున్న ఇసుకాసురులు

## సిఐ ఎదుటే రైతుపై ఇసుక నిర్వాహకుడి దాడి..!

- మణుగూరు సీఐ సమక్షంలో ఘటన
- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు..
- గోదావరి ఇసుక ర్యాంపుల అక్రమాలపై కొత్త వివాదం
- ఇసుక నిర్వాహకుడి పై కేసు నమోదు చేశాం: డీఎస్పీ

మణుగూరు మహా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ఇసుక నిర్వాహకుల దౌర్జన్యాలు మళ్లీ బయటికొచ్చాయి. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఎదుటే ఓ రైతుపై ఇసుక నిర్వాహకుడు దాడి చేశాడని ఆరోపణలు శుక్రవారం వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై బాధితుడు మునిగల నాగేశ్వరరావు డీఎస్పీ రవీందర్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



బాధితుడు నాగేశ్వరరావు

### కేసు నమోదు చేశాం

మణుగూరు పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ సి ఐ నాగబాబు సమక్షంలోనే నాగేశ్వరరావు అనే రైతు పై దాడి చేసిన ఘటనలో ఇసుకరామ్ నిర్వాకుడు కంట రమేష్ పై కేసు నమోదు చేశామని మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు. దాడి సంఘటనపై డిఎస్పీని వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎన్ ఎన్ మహా పత్రికకు వివరణ ఇచ్చారు.

## ఏన్కూరు పంచాయితీ రహస్యాల వలయం

- దస్తావేజుల గల్లంతు, అవకతవకలు
- పెసా చట్టం కింద పంచాయితీ మోసం
- కాలువల ఆక్రమణపై కళ్లెం లేదు
- వేలంపాటల్లో గిరిజనుల హక్కు తాకట్టు



03

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

పభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పి.హెచ్.సి. లలో పని చేసే ప్రతి సిబ్బంది అటెండెన్స్ ఆన్ లైన్ చేసి 100 శాతం మానిటరింగ్ చేయాలని అన్నారు.



04

# మానసిక ప్రశాంతతతోనే సంపూర్ణ ఆరోగ్యం

## మెజిస్ట్రేట్ సూరి రెడ్డి

**మణుగూరు, మహా:** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మణుగూరు మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మానసిక ప్రశాంతతతోనే శారీరక ఆరోగ్యం బాగుంటుంది అనే నినాదాలతో న్యాయవాదులు ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యం సమాజ అభివృద్ధికి కీలకం. మనసు ప్రశాంతంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని తగ్గించుకునే అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన ఆలోచనలు, సానుకూల దృక్పథం మానసిక ప్రశాంతతకు పునాది అవుతాయని అన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎస్సై నగేష్, మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బద్దం శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు విజయరావు, చిర్రా రవికుమార్, కవిత, చిర్రా సరస్వతి, బొంతు సునీత, పోషం భాస్కర్, రమేష్, శ్రీవిద్య కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# రాజకీయ లాభం కోసం రిజర్వేషన్లతో ఆట!

- హైకోర్టు స్టే ప్రభుత్వం వైఫల్యానికి చిహ్నం
- బీసీల హక్కులు తాకట్టు!
- జిల్లా మంత్రులు కమిషనర్ కోసమే పని చేస్తున్నారు
- రెండేళ్లు దాటిన జిల్లాలో కనిపించిన ప్రగతి
- కేంద్ర ప్రభుత్వం నిధులను మావి అని చెప్పుకోవడం శోచనీయం
- మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం, మహా:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు విధించిన స్టే రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో కాంగ్రెస్ పాలనకు నల్లపేజీగా నిలిచిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, “రాజకీయ లాభం కోసం చట్టాన్ని తాకట్టు పెట్టిన ఈ ప్రభుత్వం ఇప్పుడు న్యాయస్థానం చేతిలో చెంపదెబ్బ తిన్నది” అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రేవంత్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బీసీ వర్గాల మద్దతు సంపాదించాలనే ఉద్దేశంతో తొందరపాటుగా రిజర్వేషన్లను ప్రకటించిందని ఆయన అన్నారు. కానీ ఆ ప్రక్రియలో సుప్రీంకోర్టు స్పష్టంగా సూచించిన ‘ట్రిపుల్ టెస్ట్’ ప్రమాణాలను విస్మరించిందని కోటేశ్వర రావు మండిపడ్డారు. బీసీ వర్గాల సామాజిక, విద్యా స్థితిగతులపై స్వతంత్ర కమిషన్ నివేదిక లేకుండా, ప్రభుత్వ అంచనాల ఆధారంగా శాతం నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమని




ఆయన తెలిపారు. “ఈ ప్రభుత్వానికి చట్టపరమైన అవగాహన లేకపోవడం కాదు, కావాలనే నిర్లక్ష్యం చేయడం. చట్టం కంటే రాజకీయ లాభం ముఖ్యం అన్న ధోరణి తెలంగాణ పాలనలో స్థిరపడింది” అని ఆయన విసురుగా అన్నారు. హైకోర్టు స్టే వెనుక ఉన్న అసలు కారణం రేవంత్ ప్రభుత్వ అహంకారం, అధికార దుర్వినియోగమేనని కోటేశ్వరరావు అన్నారు. “న్యాయ సలహాలను పట్టించు కోకుండా, అధికారుల సూచనలను పక్కన పెట్టి, కేవలం రాజకీయ ఒత్తిళ్లకు లోనై తీసుకున్న నిర్ణయాలు ఈ అవమానకర పరిస్థితికి దారి తీశాయి. ప్రజాస్వామ్యంలో చట్టం కంటే పెద్దది ఏదీ లేదు. కానీ రేవంత్ ప్రభుత్వం చట్టాన్ని కాళ్ల కింద వేసి పరిపాలన చేస్తోంది” అని ఆయన వ్యాఖ్యానించారు. హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయి పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీలలో పరిపాలన స్తంభించిందని, ప్రజలకు అవసరమైన సేవలు అందడం కష్టమైందని ఆయన వివరించారు. “ప్రజాస్వామ్యాన్ని కాపాడే హక్కు న్యాయ వ్యవస్థదే. అందుకే హైకోర్టు ప్రజల తరఫున మాట్లాడింది. ఇది కేవలం రిజర్వేషన్లపై తీర్పు కాదు – ఇది రేవంత్ ప్రభుత్వ అహంకారంపై తీర్పు” అని కోటేశ్వరరావు పేర్కొన్నారు.

# భద్రతా చర్యలు తప్పనిసరి

## మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి



మణుగూరు, మహా : మణుగూరు పట్టణంలోని దీపావళి బాణాసంచా దుకాణ నిర్వాహకులతో డీఎస్పీ రవీందర్ రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాణాసంచా విక్రయ కేంద్రాలు నిబంధనలకు లోబడి నిర్వహించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్లు కేవలం అనుమతుల మేరకే ఏర్పాటు చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని హెచ్చరించారు. ప్రజలు కూడా సురక్షితంగా బాణాసంచా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ నాగబాబు, వ్యాపారులు పాల్గొన్నారు.

# టీచింగ్ పోస్టులకు దరఖాస్తు సమర్పించాలి

**ఖమ్మం,మహా:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయుటకు ఆసక్తి గల వారు అక్టోబర్ 15 లోపు దరఖాస్తు సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.డి. ముజాహిద్ శుక్రవారం తెలిపారు. సత్తుపల్లి బాయ్స్ నందు జనరల్ టిజిటి ఇంగ్లీష్, నేలకొండపల్లి బాయ్స్ నందు జనరల్ జెఎల్ మ్యాథ్స్, స్త్రీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల నందు మ్యాథ్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ పోస్ట్ లు, వైరా గర్ల్స్ నందు పిజిటి ఇంగ్లీష్, ఖమ్మం గర్ల్స్ నందు ఫిజికల్ డైరెక్టర్ పోస్ట్ ఖాళీగా ఉందని అన్నారు. జె.ఎల్, పిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీ 50 శాతం మార్కులతో పాటు బీ.ఇడీలో 50 శాతం మార్కులు, టి.జి.టి. పోస్టులకు సంబంధిత సబ్జెక్టు గ్రాడ్యుయేషన్, బీ.ఇడి లో 50 శాతం మార్కులతో టెట్ తప్పనిసరి అని, బోధన అనుభవం 3 సంవత్సరాలు ఉండాలని, అభ్యర్థులు ఖమ్మం జిల్లాకు చెందిన వారై ఉండాలని అన్నారు.

# విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



**ఖమ్మం, మహా:** నేటి విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని మరింతగా పెంపొందించుకోవాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో బాలసాని సన్యాసయ్య మెమోరియల్ తెలంగాణ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ను మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కాసేపు టేబుల్ టెన్నిస్ ఆడి.. వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుంచే నచ్చిన క్రీడలో సాధన చేస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఎల్లప్పుడూ లభిస్తుందని, ప్రపంచంతో పోటీపడేలా నూతన క్రీడా విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో..: డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్ కుమార్, కార్యదర్శి వీఎస్ఎస్ మూర్తి, డాక్టర్ రవి మారుతి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేంద్ర, టీపీసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, నాయకులు స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న బిజెపి భారీ మూల్యం తప్పదు

**ఖమ్మం సిటీ, మహా:** బీసీ బిల్లును 9 వ షెడ్యూల్లో చేర్చకుండా గవర్నర్ దగ్గర రాష్ట్రపతి దగ్గర పెండింగ్లో పెట్టి ఈసీలకు తీరని అన్యాయం చేసినటువంటి బిజెపి పార్టీ ముమ్మాటికి బీసీల ద్రోహి అని, రాబోయే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం లిజిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ హెచ్చరించారు. రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు ధర్నాలు ర్యాలీలు చేయబోతున్నామని బి సీలకు ద్రోహం చేసిన ఎవరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.



# ఏన్కూరు పంచాయితీ రహస్యాల వలయం

- దస్తావేజుల గల్లంతు, అవకతవకలు
- పెసా చట్టం కింద పంచాయితీ మోసం
- కాలువల ఆక్రమణపై కళ్లెం లేదు
- వేలంపాటల్లో గిరిజనుల హక్కు తాకట్టు




**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు గ్రామపంచాయితీ ఇటీవల ఇచ్చిన ఆర్‌టీఐ సమాధానాలు ఒక చిన్న పంచాయితీలో ఎంత పెద్ద స్థాయిలో పరిపాలనా నిర్వాకం, రికార్డు లేమి, పారదర్శకత లేకపోవడం నెలకొని ఉందో బహిర్గతం చేస్తున్నాయి. గ్రామస్థుడు నరసింహారావు దాఖలు చేసిన సమాచార హక్కు చట్టం దరఖాస్తు ఆధారంగా వచ్చిన సమాధానాలు, రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి పరిపాలన ఎంత నిర్లక్ష్యంగా సాగుతోందో ప్రతిబింబించే అద్దమ య్యాయి. ఏన్కూరు పంచాయితీ, పెసా చట్టం పరిధిలోకి వచ్చే షెడ్యూల్డ్ ఏరియా గ్రామం. ఇలాంటి ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు అత్యంత ప్రాధాన్యంగా రక్షింపబడాలి. కానీ ఇక్కడి పరిపాలన మాత్రం చట్టపరమైన పద్ధతులకే వ్యతిరేకంగా, రికార్డు లేని ఖర్చులు, కనిపించని ఫైళ్లు, తెలియని నిధులు, దొరకని నివేదికలు, అందుబాటులో లేని తీర్మానాలతో నిండిపోయి ఉంది.ఏన్కూరు గ్రామపంచాయితీ కార్యాలయం ఆర్‌టీఐ ప్రకారం అందించిన వివరాలు స్థానిక పరిపాలనలో నిబద్ధత, బాధ్యత, చట్టపరమైన అవగాహన ఎంత దుర్బలంగా ఉందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. 2019 నుండి 2024 వరకూ గ్రామపంచాయితీ షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలంపాటలో పెసా చట్టం ప్రకారం కేవలం స్థానిక ఎస్టీ అభ్యర్థులు మాత్రమే పాల్గొనాలని నిబంధన ఉన్నా, ఆ ప్రక్రియలో పారదర్శకత లేదు. వేలంపాట రిజిస్టర్ 2018 సంవత్సరం దొరకలేదని పంచాయితీ స్పష్టంగా తెలిపింది. అంటే ఒక సంవత్సరం పూర్తి ఆదాయ, వ్యయ వివరాలు లేకుండా కాంప్లెక్స్ ఇచ్చినట్లే. ఇది పెసా చట్టం ఉల్లంఘనకే కాదు, పంచాయతీ చట్టం ప్రకారం కూడా ఘోర లోపం. 2018–2019 క్యాష్‌బుక్ లభించకపోవడం, 40 పేజీల వార్షిక నివేదిక లేకపోవడం, పూర్వపు ఆర్‌టీఐ దరఖాస్తులు కనిపించకపోవడం వంటి అంశాలు గ్రామ రికార్డుల నాశనాన్ని, లేక గోప్యతా ఉద్దేశపూర్వక దాచిపెట్టడాన్ని సూచిస్తున్నాయి. ముఖ్యంగా పంచాయితీ ఫండ్స్‌లో 12 లక్షల రూపాయల ఓపెనింగ్ బ్యాలెన్స్ ఉన్నా, ఖర్చు వివరాల్లో అస్పష్టత ఉంది. డీజిల్, ట్రాక్టర్ టైర్లు, ఫర్నిచర్, మెషీన్ కొనుగోళ్ల వంటి ఖర్చులు ఉన్నప్పటికీ బిల్లులు, క్విటెన్స్ ఆధారాలు లేవు. ఏన్కూరు గ్రామంలోని చెరువు పరిధి, కాలువ మార్గాల వివరాలు రెవిన్యూ మరియు ఇరిగేషన్ శాఖలకే ఉన్నాయని చెప్పి పంచాయితీ తప్పించుకుంది. ఇది గ్రామపాలనా బాధ్యతను బదిలీ చేసే ప్రమాదకర ధోరణి. స్థానిక ప్రజల ఫిర్యాదుల ప్రకారం పంటకాలువలు పూడ్చివేయబడి, భవనాలు నిర్మించబడినట్లు ఆరోపణలు ఉన్నా, పంచాయితీ "మా పరిధిలో లేదు" అంటూ పక్కకు తప్పుకుంది.

### మురికి, చెత్త సేకరణలో నిర్లక్ష్యం

గ్రామంలో చెత్త సేకరణ ప్రతిరోజూ జరుగుతుందని సమాధానం ఇచ్చినప్పటికీ, స్థానిక మార్కెట్లలో చెత్త పేరుకుపోయిన సమస్యలు తరచూ వస్తున్నాయి. ఇది పంచాయితీ యంత్రాంగం సక్రమంగా పనిచేయకపోవడాన్ని సూచిస్తుంది. ఆర్‌టీఐ సమాధానం ద్వారా డ్రైవర్‌కు మళ్లీ ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొనడం, గతంలో చేసిన నిర్లక్ష్యాన్ని అంగీకరించడమే.

### పన్ను రిజిస్టర్‌లో గందరగోళం

2010 నుండి 2025 వరకు ఇండ్ల సంఖ్య, పన్ను డిమాండ్ రికార్డులు ఉన్నాయని చెప్పినా, డిమాండ్ స్థాయిలో ఎక్కడెక్కడా అసమానతలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు, 2014-2015లో 36 లక్షల రూపాయల డిమాండ్, కానీ 2020 నాటికి కేవలం 16 లక్షలు మాత్రమే. ఇది పన్ను సేకరణలో తీవ్రమైన లోటు లేదా దుర్వినియోగాన్ని సూచిస్తుంది. బహుళ అంతస్తు భవనాలు .. రిజిస్టర్‌లో నమోదు లేదు.

# పెంచిన డిగ్రీ ఫీజులను వెంటనే తగ్గించాలి



**కొత్తగూడెం టౌన్, మహా:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి.డి.ఎస్.యూ) ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని రామచంద్రా డిగ్రీ కాలేజీ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ జిల్లా అధ్యక్షులు విజయ్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల ఫీజులను అమాంతం పెంచడం హేయమైన చర్యాని పేర్కొన్నారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర అన్నారు. అంతంతమాత్రంగానే సాగుతున్న డిగ్రీ కోర్సులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్ర ఎంత మాత్రం తగదన్నారు. గత కాలం ఫీజులతో చూస్తే ప్రస్తుతం యూనివర్సిటీ పెంచిన ఫీజులకు భూమికి, ఆకాశానికి ఉన్నంత దూరం ఉందని దీని ద్వారా పేద విద్యార్థులకు ముఖ్యంగా ఆదివాసీ విద్యార్థులకు ఆర్థిక భారం అధికమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్, నరేందర్, లోకేష్, చంటి, లోహిత పాల్గొన్నారు.

# రిజర్వేషన్ లను అడ్డుకున్న పాపం బీజేపీ బిఆర్ఎస్‌లదే



**కొత్తగూడెం టౌన్, మహా:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం పార్లమెంట్ సోషల్ మీడియా ఇంచార్జి వీరాపురం రామలక్ష్మణ్ రావు, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు అజ్మీరా సురేష్ నాయక్ ల ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో జేబి శౌరి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కులగణన చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల రూపొందించినట్లు గుర్తు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం 42 శాతం బీసీల రిజర్వేషన్ కు కట్టుబడి ఉందని చెప్పారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటై బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నాయని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్న సమయంలో కోర్టు తీర్పు ఊహించలేదని చెప్పారు. బీసీల నోటి కాడ కూడు లాగేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు మోరె రమేష్, షేక్ నిసార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్



**భద్రాద్రి బ్యూరో, మహా:** ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. తర్వాత తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపరింటెంట్ రంగ ప్రసాద్ ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

# బీసీ సంఘం ఆధ్వర్యంలో నిరసన



**బూర్గంపహాడ్ మహా:** బీసీ రిజర్వేషన్ పై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేసి, సారపాక పట్టణంజాతీయ రహదారి పై నిరసన కార్యక్రమం చేపట్టారు ఎన్నికల ప్రక్రియ నాలుగు వారాలు పాటు ఆపడం అనేది దురదృష్టకరం, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను ఆపరాదని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా నాలుగు వారాలపాటు ఎన్నికల వాదవేయడం తీవ్రంగా పరిఘనమిస్తున్నాం. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 56% బీసీ ప్రజల హక్కులను విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు నోటికాడ అన్నం ముద్దను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలలో ఎంతో చైతన్యం వచ్చింది ఊరురా స్పందన తెలియజేస్తున్నారు, బీసీలు అంటే అంత చులకనగా ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, కార్యదర్శి బెజ్జంకి కనకాచారి, పినపాక నియోజకవర్గం ఇంచార్జ్ నిదానపల్లి బాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు చిప్ప రాజు, విద్యార్థి సంఘం అధ్యక్షులు జమ్మి సాయిరాం,పిడుగు వంశీ, వెంకటేశ్వర్లు, బిసి నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే రిజర్వేషన్ల డ్రామా



**జూలూరుపాడు, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే 42 శాతం రిజర్వేషన్లు అంటూ బడుగు బలహీన వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నదని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు పత్రికా ప్రకటనలో తెలిపారు. మాయ మాటలు చెప్పి గతంలో బీసీలను మోసం చేసి, కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఆయన అన్నారు. ఇప్పుడు కూడా అదే మోసంతో స్థానిక సంస్థ ఎన్నికల్లో లబ్ది పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని తెలిపారు. ఈ నోటిఫికేషన్ వల్ల ఇప్పటికే గ్రామాలలో ఆశావాహులు ఖర్చులపాలయ్యారని, వారి పరిస్థితి ఏంటని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 420 హామీల తరహాలోనే 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొట్లాడాలని, అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఢిల్లీ వేదికగా జరగాల్సిన పోరాటాన్ని రేవంత్ గల్లీలో చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని, వారి చేతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ప్రకటనలో గిరిబాబు జోస్యం చెప్పారు.

## బీసీలకు న్యాయం - కాంగ్రెస్ సంకల్పం



**ఖమ్మం, మహా:** బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకే ఉందని తెలంగాణ బీసీ సంఘం నాయకుడు కమర్తపు మురళీ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తూ ఎన్నికలకు వెళుతుందని స్పష్టం చేశారు. బీసీల సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కేబినెట్‌లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించడమే కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనం" అని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ జోహార ఫాతిమా, మార్కెట్ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘం నాయకులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 100 శాతం వైద్య సిబ్బంది అటెండెన్స్ ఆన్ లైన్ ద్వారా నమోదు
- ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు
- ఎన్.సి.డి. సర్వే నిర్వహణపై వైద్య అధికారులు దృష్టి సారించాలి
- వైద్య,, ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం,మహా:** ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పి.హెచ్.సి. లలో పని చేసే ప్రతి సిబ్బంది అటెండెన్స్ ఆన్ లైన్ చేసి 100 శాతం మానిటరింగ్ చేయాలని అన్నారు. ప్రసవ సమయంలో తల్లి మరణాలకు సంబంధించి కేసులు పరిశీలిస్తే రెండవ ఏ.ఎన్.సి. చెక్ అప్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేసుకున్నట్లు తేలిందని, దీనికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. గత సంవత్సర కాలంగా ప్రతి ఆశా కార్యకర్త పరిధిలో మొదటి, రెండు ఏ.ఎన్.సి. చెక్ అప్ ప్రైవేట్ ఆసుపత్రులలో జరిగిన కేసులు పరిశీలించి రిపోర్టు అందించాలని, దీనికి గల బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి వైద్యాధికారి తన పరిధిలోని ఆశా కార్యకర్తలతో రెగ్యులర్ గా సమావేశాలు పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీ లకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించిన ప్రైవేట్ ఆసుపత్రులపై కూడా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలు రెగ్యులర్ గా తమ పరిధిలో ఇంటింటి సర్వే చేస్తూ గర్భిణి మహిళల వంద శాతం ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల దగ్గర ఉన్న వసతులు ప్రైవేటు ఆసుపత్రులలో లేవని, ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి సెక్షన్ డెలివరీలను నివారించాలని అన్నారు. అధికంగా సి సెక్షన్ జరుగుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల పై నిఘా పెట్టాలని, ప్రతి సెక్షన్ ఆపరేషన్ పై ఆడిట్ రిపోర్ట్ ఉండాలని అన్నారు. జిల్లాలో అనవసరంగా సి సెక్షన్ డెలివరీలను చేసే ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశా కార్యకర్తలు ప్రతి గర్భిణీ స్త్రీ ను ఫాలో అప్ చేస్తూ ఉచితంగా మన ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి పి.హెచ్.సి. పరిధిలో వంద శాతం పిల్లలకు టీకాలు వేయించాలని, వైద్య అధికారులు టీకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి ఆశా కార్యకర్త ఫాలో అప్ చేయాలని అన్నారు. ప్రతి పి.హెచ్.సి. పరిధిలో ఎన్.సి.డి. సర్వే పూర్తి చేసి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, వైద్య అధికారులు తమ పరిధిలో ఆశా కార్యకర్తలతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. ఎన్.సి.డి. సర్వే నిర్వహణలో ఆశా కార్యకర్తలు, ఏ.ఎన్.ఎం, ఎం.ఎల్.హెచ్.పి. పాత్ర ఎంత ఉండాలో నిర్దేశించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, వివిధ ప్రోగ్రాం అధికారులు, వైద్య అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత సాధించడంలో కాంగ్రెస్ వైఫల్యం



**ఖమ్మం, మహా:** బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యమైందని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో.9పై హైకోర్టు స్టే ఇవ్వడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయమై నామ స్పందిస్తూ బీసీల హక్కులు, అవకాశాలను రక్షించాల్సిన బాధ్యత ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆయన విమర్శించారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకొనిపోయి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. కానీ నేడు రాష్ట్రం లో బీజేపీ, కాంగ్రెస్ నుండి పదహారు మంది ఎంపీలు వుండి కూడా బీసీ రేజర్వేషన్ల విషయమై ఏనాడు కూడా పార్లమెంట్ ను స్థంబింపజేయలేదని, కనీసం వారి హక్కుల కోసం పోరాటం చేయలేదన్నారు. రెండు పార్టీలు కూడా బీసీ లను మోసం చేశాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీల ద్వంద వైఖరి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా పార్లమెంటులో చట్టం ద్వారా బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కేసీఆర్ సూచనలు మేరకు బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిన తీరు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సక్రమంగా సిద్ధం చేయకపోవడం, చట్టపరమైన ప్రక్రియలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు బీసీ వర్గాల అభ్యున్నతి పేరుతో గొప్ప హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను మరిచిపోయిందని ఆయన విమర్శించారు.

## విఠల్‌రావు నగర్‌లో సింగరేణి వైద్య శిబిరం



**మణుగూరు, మహా :** మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని విఠల్ రావు నగర్‌లో శుక్రవారం సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బొగ్గు గనుల పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే సామాజిక బాధ్యతలో భాగంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు, వృద్ధులు, విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 155 మంది ప్రజలకు సాధారణ వ్యాధులకు ఉచిత మందులు పంపిణీ చేయగా, రక్తపోటు, షుగర్ వంటి వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్ మాట్లాడుతూ, గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని సూచించారు. గ్రామ ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించి వైద్య సేవ లందించినందుకు సింగరేణి వైద్య బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ బెనర్జీ, స్టాఫ్ నర్స్ అనంతలక్ష్మి, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ కెవి మారీశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది రమ, రాము, భాను, విఠల్ రావు నగర్ శ్రీరామ్ యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# దేవినేని పేరుతో టీడీపీ నేతల మోసం

**ఖమ్మం ,మహా:** తెలంగాణ రాజకీయ వర్గాల్లో కలకలం రేపే సైబర్ మోసం చోటుచేసుకుంది. విశ్వసనీయతను ఆయుధంగా మలచుకున్న ఒక నేరగాడు, పేరుప్రతిష్ఠలు గల తెలుగు దేశం పార్టీ నేతలను సులభంగా వలలోకి దింపాడు. "దేవినేని ఉమా పీఏ"గా పరిచయమై వీడియో కాల్ ద్వారా ఆ నేతల విశ్వాసాన్ని సొంతం చేసుకున్నాడు. పార్టీ కార్యకర్తల పిల్లల చదువుకు సాయం చేస్తామన్న ముసుగులో మొదట చిన్న మొత్తాన్ని దోచుకున్న ఈ నేరగాడు, తర్వాత 'చంద్రబాబు వద్ద బీ ఫామ్స్ ఇప్పిస్తాను' అని నమ్మబలికాడు. దేవినేని ఉమా స్వయంగా మాట్లాడుతున్నట్లు కనిపించిన వీడియో కాల్, సత్తుపల్లి నేతల విశ్వాసాన్ని చీల్చి వేసింది. చివరికి దాదాపు రెండు దఫాల్లో మోసపోయి, పరువు పోతుందనే భయంతో మౌనం వహించిన ఆ నేతలు ఇప్పుడు సైబర్ మోసానికి నిదర్శనంగా మారిపోయారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన టీడీపీ నేతలు ఇటీవల అరుదైన సైబర్ మోసానికి బలి అయ్యారు. సెప్టెంబర్ 30న ఒక అగంతకుడు దేవినేని ఉమా పీఏనంటూ వారికి ఫోన్ చేశాడు. "సర్ వీడియో కాల్ చేస్తారు, కార్యకర్తల పిల్లల చదువుకు ఆర్థిక సాయం చేయాలనుకుంటున్నారు" అని చెప్పడంతో



నేతలు ఉత్సాహపడ్డారు. కాసేపటికే వీడియో కాల్‌లో దేవినేని ఉమా స్వయంగా మాట్లాడినట్లు కనిపించింది. నేరగాడు మూడు బ్యాంక్ నంబర్లు ఇచ్చి, వాటికి మొత్తాలు పంపాలని సూచించాడు. పార్టీపై విశ్వాసం, నాయకులపై అభిమానం కలిసివచ్చి నేతలు రూ.35 వేలు వెంటనే పంపించారు. అక్కడితో ఆగకుండా అక్టోబర్ 7న మళ్లీ కాల్ చేసి "అమరావతికి రండి, చంద్రబాబు వద్దకు తీసుకెళ్తాను, బీ ఫామ్స్ ఇప్పిస్తాను" అని చెప్పాడు. ఈసారి అతని మాటలు మరింత విశ్వసనీయంగా వినిపించడంతో సత్తుపల్లిలోని 18 మంది నేతలు విజయవాడకు వెళ్లారు. వారందరినీ ఓ హోటల్‌లో ఉంచి, "బిల్ మొత్తాన్ని నేనే కడతాను" అని చెప్పిన ఆ వ్యక్తి, మరోసారి కాల్ చేసి "సీఎంను కలవడానికి ఎనిమిది మందికే అనుమతి ఉంది, ఒక్కొక్కరు రూ.10 వేలు ఇవ్వాలి" అని అడిగాడు. ఇంతలో నేతలకు అనుమానం కలిగింది. తక్షణమే వారు దేవినేని ఉమాను స్వయంగా సంప్రదించగా, ఆయన "నేను ఎవ్వరికీ కాల్ చేయలేదు, వీడియో కాల్ కూడా చేయలేదు" అని చెప్పడంతో విషయం అర్థమైంది. తమను ఎవరైనా మోసం చేశారనే విషయాన్ని గ్రహించిన నేతలు పరువు పోతుందనే భయంతో ఎవరికి చెప్పకుండా హోటల్ నుంచి నిశ్శబ్దంగా వెళ్లిపోయారు. తరువాత విచారణలో ఏలూరు జిల్లాకు చెందిన భార్గవ్ అనే వ్యక్తి ఈ సైబర్ మోసానికి మూలకర్త అని తెలిసింది. ఆయన దేవినేని ఉమా వీడియోలు, చిత్రాలు సేకరించి వాటిని కృత్రిమ మేధా సాంకేతికతతో కలిపి వీడియో కాల్ మాదిరిగా తయారు చేశాడు. ఈ ఘటన రాజకీయ నేతలను కూడా వదలని సైబర్ మోసగాళ్ల ధైర్యానికి నిదర్శనం. విశ్వసనీయ పేర్లను వినియోగించి ప్రజల, కార్యకర్తల విశ్వాసాన్ని వాడుకోవడంలో ఈ నేరగాళ్లు ఎంత ముందుకు వెళ్ళారో చూపిస్తోంది. దేవినేని ఉమా ఈ ఘటనపై స్పందిస్తూ, "నా పేరు ఉపయోగించి ఎవరో నేతలను మోసం చేశారు. వారిని పట్టుకునే వరకు ఆగను. పోలీసులతో కలిసి ఈ నేరాన్ని ఛేదిస్తాం" అని తెలిపారు.

## ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



**ఖమ్మం,మహా:** ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేపట్టేందుకు సోమవారం (అక్టోబర్ 13) నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ 10 రోజుల పాటు చేపట్టడం జరుగుతుందని అన్నారు.నగర వ్యాప్తంగా పేరుకు పోయిన చెత్తను శుభ్రం చేయాలని, మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జవాన్ నుంచి సహాయ కమీషనర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని అన్నారు. చెత్త తో ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసిన తర్వాత ముందు, ఆ తరువాత తేడాను తెలియజేసేలా ఫోటోలు తీయాలని, ప్రత్యేక పారిశుధ్య నిర్వహణకు అవసరమైన అదనపు లేబర్, ఎక్విప్మెంట్ అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు. నగరంలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లలో ఎక్కడ చెత్త ఉండకుండా శుభ్రం చేయాలని, వర్షాల వల్ల పేరుకుపోయిన మట్టి తొలగించాలని అన్నారు.

## ఏసు సిలువను ధ్వంసం చేసిన దుండగులు



**బోనకల్ మహా:** బోనకల్ మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో గురువారం రోజున రాత్రి 9 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు జెసిబిల సహా యంతో ఆ చర్చి స్థలంలో ఉన్నటువంటి క్రీస్తు యేసు సిలువను మరియు రేకులు షెడ్డును ధ్వంసం చేశారని తెలిపారు. దుండగులు ధ్వంసం చేసిన సిలువను ఎన్ఎస్పీ కాలువలో పడవేశారన్నారు. చర్చి పాస్టర్ రాంబాబు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న దుండగులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## రెనాల్ట్ రెనాల్ట్ నిస్సాన్‌కు 65 మంది యస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక

**ఖమ్మం సిటీ, మహా:** ప్రముఖ అంతర్జాతీయ వాహన రంగ సంస్థ రెనాల్ట్ నిస్సాన్ కు తమ కళాశాలకు చెందిన 65 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగిన ప్రాంగణ నియామకాలలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ పెరుగుతున్న ప్రమాణాల దృష్ట్యా వాహన రంగంలో రానున్న రోజులలో మరింత ఆదరణ ఉంది అని కృష్ణ తెలిపారు. అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాలలో వాహన రంగం ముందుంటుందని గుర్తు చేశారు. ఎంపికైన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని ఆశించారు. రెనాల్ట్ నిస్సాన్ వంటి అంతర్జాతీయ సంస్థలలో తమ విద్యార్థులు ఎంపిక అవ్వడం హర్షించ తగ్గ విషయం అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. కేవలం సాఫ్ట్ వేర్ రంగంలోనే కాకుండా ఇతర కోర్ రంగాల వైపు కూడా యువత దృష్టి సారించాలని తద్వారా సమాజంలో సమతుల్యత పాటించగలమని తెలిపారు. ప్రొడక్షన్ ఇంజనీర్ ఉద్యోగాలకు జరిగిన ఎంపికలలో 136 మంది ఈ.సి.ఈ. మరియు ఈ.ఈ.ఈ. విద్యార్థులు పాల్గొనగా 112 మంది రాత పరీక్షలలో ఎంపికై తదుపరి మౌఖిక పరీక్షకు అర్హత సాధించారని, తుది పరీక్షలో 65 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇతర సదుపాలతో పాటు వార్షిక ఆధాయంగా 3.0 లక్షలు అందుకుంటారని తెలిపారు.



# తెలంగాణ ప్రజల మనిషి దామోదర్ రెడ్డి

**మహా, ఖమ్మం:** జిల్లా కామేపల్లి మండలం పాత లింగాల గ్రామంలో సెప్టెంబర్ 14,1952. న రాంరెడ్డి నారాయణరెడ్డి – కమలమ్మల దాంపత్యాన 6 సంతానమే, రాంరెడ్డి దామోదర్ రెడ్డి 4 తరగతి వరకు పాత లింగల ప్రభుత్వ పాఠశాలలోని విద్యాభ్యసించాడు, తదుపరి చదువులకు హైదరాబాద్ వెళ్లారు, డిగ్రీ వరంగల్లో అభ్యసించి అనంతరం,తుంగతుర్తి దేశ్ ముఖ్ ఉప్పునూతల సర్వోత్తమ్ రెడ్డి – కౌసల్యదేవి, దంపతుల కుమార్తె వరుదినిదేవి తో వివాహం జరిగింది వారి దాంపత్యానికి వారి కుమారుడు సర్వోత్తమ రెడ్డి అతని పేరు కూడా తాతయ్య పేరు పెట్టడం విశేషం నిత్యం ప్రజల మనిషి అనడానికి నిలువుటద్దం దామోదర్ రెడ్డి,నాడు యువకునిగా ఉన్నప్పుడు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షునిగా వి హనుమంతరావు రాష్ట్ర కోశాధికారిగా దామోదర్ రెడ్డి పనిచేశారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహచర బృందంతో చురుకుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి భూమిక పోషించారు, అదే క్రమంలో ఉమ్మడి నల్గొండ, తుంగతుర్తి ప్రాంతం కమ్యూనిస్టుల కంచుకోటగా ఉన్న భూభాగ ప్రజలను చైతన్యపరిచి స్వచ్ఛమైన రాజకీయ వ్యవస్థకు నాంది పలుకుతూ తోలుతగా తమ



పూర్వీకులు నిర్మాణం చేపట్టిన పట్టాభి రామచంద్ర స్వామి ఆలయ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించి ప్రజల మన్ననలను పొందారు,1985 సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో మల్లు స్వరాజ్యం ఓడించి అసెంబ్లీలో అడుగు పెట్టాడు, 1985,1989,1994, 2004,2009 వరస విజయాలు గెలుపొంది, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఓడరేవుల భూగర్భ జలవనరుల ల శాఖ మంత్రిగా, వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలోఐటీ మరియు కమ్యూనికేషన్ క్రీడల,మంత్రిగా పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి తన వంతు పాత్ర వహించాడు, తుంగతుర్తి 2009 అసెంబ్లీ స్థానాల పునర్విభజనలో ఎస్సీ రిజర్వ్ కావడంతో ప్రజల ప్రేమ ఉన్న నాయకుడు కాబట్టి సూర్యాపేట ప్రజలు ఆహ్వానం మేరకు అక్కడ పోటి చేసి గెలుప పొంది ఆ ప్రాంత ప్రజల అభివృద్ధికి బీజం పోశాడు, నల్లగొండ ప్రజలకు బీడు భూములను సస్యశ్యామలం చేసి రైతన్నల మనస్సులో వెలుగులు వెలగాలని గోదావరి జలాలు తీసుకురావడంలో శ్రమించి ఆ ప్రాంతానికి నీళ్లు తీసుకురావడంలో విజయం సాధించారు, రాజకీయ శత్రువు లను గుండెల్లో దడ పుట్టేలా రాజకీయ చతురతను ప్రదర్శించేవారు, ఆ నేపద్యంలో టైగర్ దామన్న గా చరిత్రకారునిగా నిలిచారు, 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను చూసి నిత్యం ప్రజల పక్షాన నిలబడిన నిక్కసైన కాంగ్రెస్ వాది అయిన. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు బీజం పడ్డ 1969 ఉద్యమంలో చిన్ననాడే ఉద్యమంలో పాల్గొని జై తెలంగాణ అని నినదించిన ఉద్యమకారుడు, అప్పటికి విద్యార్థిదశలోనే ఉన్నారు, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు.

# తిరుమల ప్రభావం అల్లిపురం వైపు

## ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వరుని దివ్యక్షేత్రం...

### దివ్యక్షేత్ర నిర్మాణానికి టిటిడి ముందడుగు

### పరిశీలన పూర్తి చేసిన టిటిడి అధికారులు

**ఖమ్మం, మహా:** భక్తి రసముతో తడిసిన తెలుగు నేలపై తిరుమల పేరు ఒక తాలూకు తాత్విక శబ్దం. ఆ శబ్దం వినిపించినచోట భక్తుల మనసుల్లో ఆశ, ఆరాధన, ఆనందం పెల్లుబికిపోతాయి. అటువంటి దివ్య ఆరాధన ఇప్పుడు ఖమ్మం భూమిని చేరబోతోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం ఖమ్మం జిల్లాలో రూపుదిద్దుకోనుందన్న వార్త వినగానే భక్తుల హృదయాలు పులకరించాయి. తెలంగాణ వ్యవసాయ , మార్కెటింగ్ మంత్రి ప్రాతినిధ్యం వహించగా, తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సీనియర్ అధికారులు, సభ్యులతో కూడిన బృందం అల్లిపురం గ్రామ పరిధిలో రెండు స్థలాలను పరిశీలించింది. ప్రభుత్వాల పరస్పర సహకారంతో ఈ ప్రతిపాదన ఇప్పుడు అధికారిక దశలోకి అడుగుపెడుతోంది.



#### అల్లిపురంలో తిరుమల వాతావరణం..

టిటిడి బృందం సమీక్షలో ప్రధానంగా రెండు భూభాగాలు నిలిచాయి. మొదటి స్థలం అల్లిపురం సర్వే నంబర్లు 565, 563, 564, 560 పరిధిలో ఉన్న 20 ఎకరాల రాకీ హిల్ ప్రాంతం. నేషనల్ హైవేకు పక్కన ఉండే ఈ ప్రదేశం కనువిందుగా మెరిసిపోతోంది. ఇక్కడ సూర్యోదయం భక్తిని మేల్కొలిపే దృశ్యమైతే, అక్కడ తిరుమల ప్రభావం స్పష్టంగా ఆవిష్కృతమవుతోంది. ఇది అత్యంత ప్రాధాన్యత గల ప్రదేశంగా టిటిడి గుర్తించింది. రెండవ స్థలం అల్లిపురం సర్వే నంబర్ 408లో ఉన్న మైదాన భూమి, విస్తీర్ణం కూడా 20 ఎకరాలు. రోడ్డు యాక్సెస్ ఉన్న ఈ భూభాగం రెండవ ప్రాధాన్యతగా నిలిచింది. ఈ రెండు స్థలాల్లో ఏదైనా ఆలయ నిర్మాణానికి అనుకూలమని అధికారులు సూచించారు.

#### ఆధ్యాత్మికతకు కొత్త చిరునామా...

తిరుమల స్ఫూర్తిని ఖమ్మం నేలపై విస్తరించాలన్న సంకల్పం వెనుక భక్తి, భావం , భవిష్యత్ అభివృద్ధి అనే మూడు బలమైన పునాదులు ఉన్నాయి. ఈ ఆలయ నిర్మాణం కేవలం మత పరమైన ఘట్టం మాత్రమే కాదు అది సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది. టిటిడి ఆధ్వర్యంలో నిర్మితమయ్యే ఈ దేవాలయం ఖమ్మం ప్రాంతాన్ని భక్తి, పర్యాటక పటంలో ప్రధాన స్థానం వైపు తీసుకెళ్తుంది. అల్లిపురం పరిసర ప్రాంతాలు భవిష్యత్తులో భక్తజన సమూహాలతో మార్మోగే పుణ్యక్షేత్రంగా మారనున్నాయి. అధికారులు ఇప్పటికే భూమి విషయంలో ప్రభుత్వ స్థాయిలో ప్రక్రియలను ప్రారంభించారు. తగిన పరిపాలనా అనుమతులు లభించిన వెంటనే దివ్యక్షేత్ర నిర్మాణ పునాది వేడుక ఘనంగా జరుగనుంది. ఈ ఆలయం పూర్తయిన తరువాత, భక్తులకు తిరుమల దర్శనానుభూతిని అందించేలా దివ్యమైన కట్టడంగా రూపుదిద్దుకోనుంది. భక్తి, శిల్పం, సంస్కృతి మేళవింపుగా ఈ ఆలయం నిలిచిపోనుందని అధికారులు వెల్లడించారు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వెనక్కి వెళ్తోంది

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా



**మణుగూరు, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశలో కాకుండా వెనక్కి నడుస్తోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. శుక్రవారం మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తుపాకి రాముడు మాటలు నమ్మి కాంగ్రెస్ వలలో చిక్కారని, ఇప్పుడు అదే ప్రజలు మోసపోయామని గోసపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేయడం, అసత్య వాగ్దానాలతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టడం తప్ప వేరే పనేమీ చేయలేదన్నారు. ఒక మంత్రి పదవి చేసినా పరిపాలనా అనుభవం ఉండేదని, కానీ ఇప్పటి కేబినెట్ మొత్తం నిమిత్తమంత్రులేనని, సీనియార్టీ ఉన్నా సబ్జెక్టు లేని మంత్రులతో ప్రభుత్వం నడుస్తోందన్నారు. గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ముక్కిన బియ్యం, పురుగుల అన్నం, నీళ్ల చారుతో విద్యార్థులు తిప్పలు పడుతున్నాతన్నారన్నారు. ఈ దయనీయ పరిస్థితులకు పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, నాయకులు పోశం నరసింహారావు, ముత్యం బాబు, ఎడ్ల శ్రీనివాస్, నూకారపు రమేష్, ముద్దంగుల కృష్ణ, వట్టం రాంబాబు, యాదగిరి గౌడ్, అడప అప్పారావు, యూసఫ్ షరీఫ్, గుర్రం సృజన్, వేర్పుల సురేష్, కోటి, మడి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మనపల్లి విద్యుత్ శాఖ పరిధి పనులు భేష్

**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండల పరిధిలోని బొమ్మనపల్లి విద్యుత్ శాఖ విద్యుత్ వెలుగులు చిన్న పరిశ్రమ పెద్ద పరిశ్రమ స్థాపించి దశలో అందుబాటులోకి వచ్చింది అతి తక్కువ సమయంలోనే టేకులపల్లి విద్యుత్ శాఖ పరిధి నుండి వేరుచేసి బొమ్మలంపల్లి పరిధి మండలంలోని రెండో సెక్షన్ గా బొమ్మనపల్లి ఏఈనీ పిండి పోలు బుజ్జి కన్నయ్య నియమించారు ఏఈ గా రావడంతోనే బొమ్మనపల్లి సెక్షన్ పరిధిలోని విద్యుత్ వెలుగులను ప్రతిభ కనబరిచి రాత్రి పగలు కష్టపడి నేడు పెద్ద చిన్న పరిశ్రమలను గిరిజనులు స్థాపించిన దశలో విద్యుత్ 24/7 అందుబాటులో తెచ్చారు. 11 కెవి పీడర్ ముత్యాలంపాడు సులానగర్ సిస్టం లో భాగంగా 11 కెవి లైన్/ఎల్ టి లైన్స్ మరమత్తులు చేసి వ్యవసాయ రైతులకు మేలు చేసి కొత్త లైన్లు వేసి రైతుల నుండి మనలను పొందుతున్నారు.



# సాయిబాబాకు ప్రత్యేక పూజలు

**తల్లాడ,మహా:** తల్లాడ మండలంలోని అన్నారు గూడెం గ్రామంలో శుక్రవారం సాయి బాబా దేవాలయం లో నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాదు నుండి తల్లాడకు వచ్చిన ఆయన ఉదయాన్నే బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్నారుగూడెంతో పాటు తల్లాడ పట్టణంలో వెంకటేశ్వరస్వామి, శివాలయం తదితర ఆలయాల్లో పూజలు చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల గోపి గౌడ్ అన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



**నేలకొండపల్లి, అక్టోబర్ 10 మహా:** పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం సంఘం పాలేరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు ఆందోళనకు దిగారు. పెన్షనర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలి. పెన్షనర్ల బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పాలేరు డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఏటుకూరి రామారావు మాట్లాడుతూ ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అనేకమార్లు ఆందోళనలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేసి సంబంధిత అధికారులకు విన్నవించిన ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. 2024 మార్చి 31 తరువాత ఉద్యోగ విరమణ పొందిన వారికి అంతకుముందు ఉద్యోగ విరమణ చేసిన వారిలో కొందరికి రావలసిన పెన్షనర్ బెనిఫిట్స్ నేటికీ చెల్లించకపోవడం ప్రభుత్వ అసమర్ధతకు అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పాలేరు డివిజన్ ప్రధాన కార్యదర్శి చిట్లా భాస్కర్ రెడ్డి, నాయకులు వల్లంచెట్ల భాస్కరరావు, మంకెనపల్లి నరసింహారావు, సిఐటియు నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**నేలకొండపల్లి, మహా:** మండలం లోని వివిధ గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా ను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.రామారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...కొత్తకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తులు మరియు చెట్ల కొమ్మలు నరికివేయటం కారణంగా కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కొత్తకొత్తూరు, నేలకొండపల్లి, తిరుమలాపురం, పైనంపల్లి, బోదులబండ, రామచంద్రాపురం, కోనాయిగూడెం గ్రామాలలో విద్యుత్ కు అంతరాయం కలగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావునా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఎదురెదురుగా బస్సులు ఢీ

**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పెట్రోల్ స్టేషన్ మూలమలుపు వద్ద శుక్రవారం ఉదయం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో ఆయా బస్సుల్లో ప్రయాణిస్తున్న చాలా మందికి గాయాలైయ్యాయి.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఖమ్మం వెళుండగా కొత్తగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం నుంచి భద్రాచలం వస్తుండగా సారపాకలోని పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో బస్సుల్లో ప్రయాణిస్తున్న 31 మందికి గాయాలయ్యాయి.వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.అక్కడ వైద్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ముదికొండ రామకృష్ణ ఆధ్వర్యంలో గాయాలు పాలైన వారందరికీ వెనువెంటనే వైద్యం అందించారు.ఈ ప్రమాదంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చిన వారికి ఎటువంటి ప్రమాదం లేదని, అందరికీ సరైన సమయంలో సరైన వైద్యం అందించడం జరిగిందని ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. గాయపడిన వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని,వారిని మాత్రం అబ్జర్వేషన్ లో ఉంచమన్నారు. సమాచారం అందుకున్న బూర్గంపాడు పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాద తీరుపై విచారణ చేపట్టారు.ఈ ఘటన కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు బస్సులను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.




# పెట్రేగిపోతున్న ఇసుకాసురులు








**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ఇసుక నిర్వాహకుల దౌర్జన్యాలు మళ్లీ బయటికొచ్చాయి. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఎదుటే ఓ రైతుపై ఇసుక నిర్వాహకుడు దాడి చేశాడని ఆరోపణలు శుక్రవారం వెల్లువెత్తుతున్నాయి. ఇసుక రైసింగ్ కాంట్రాక్టర్ గంట రమేష్ పై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై బాధితుడు మునిగల నాగేశ్వరరావు డీఎస్పీ రవీందర్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నాగేశ్వరరావు సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన వివరాల ప్రకారం.. గిరిజన సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇసుక ర్యాంపుకు కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి మణుగూరు సిఐ కి తనపై తప్పుడు ఆరోపణలు చేసి సిఐ ద్వారా పోలీస్ స్టేషన్ కు పిలిపించాడు. విషయమేమిటో తెలుసుకోవడానికి సిఐని కలిసి వివరణ ఇస్తుండగా, అక్కడే ఉన్న సదరు ఇసుక కాంట్రాక్టర్ సిఐ సమక్షంలోనే తనపై దాడి చేసి పిడిగుద్దులతో గాయపరిచాడని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ దాడిలో శరీరానికి బలమైన అంతర్గత గాయాలతో పాటు పెద్దవి చిట్లి రక్తస్రావం కూడా జరిగిందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి కి ఫిర్యాదు చేస్తూ ఇసుక నిర్వాహకుడిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘటన బుధవారం జరిగింది. బాధిత రైతు నాగేశ్వరరావుకు ఎక్కడ న్యాయం జరగకపోవడంతో డిఎస్పీకి ఫిర్యాదు చేయగా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

### ఇసుక మాఫియాను కాపాడుతున్నారు..

భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఇసుక నిర్వాహకుల కనుసన్నల్లోనే పోలీస్, రెవెన్యూ, టీజీ ఎండిసి అధికారులు పనిచేస్తున్నారనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ ఘటన ఆ ఆరోపణలకు ప్రత్యక్ష సాక్ష్యమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇసుక ర్యాంపుల నిర్వహణలో పారదర్శకత లేకపోవడంతో ప్రభుత్వం ఆర్థికంగా నష్టపోతుందన్నది స్థానికుల, రాజకీయ నాయకులు పేర్కొంటున్నారు.

- స్థానికుల ఆరోపణ..

### మళ్లీ వెలుగులోకి వస్తున్న ఆరోపణలు

మణుగూరు గోదావరి నది తీరాన ఉన్న ఇసుక ర్యాంపుల్లో దొంగ డీడీలతో ఇసుక అక్రమ రవాణా సంఘటన జరిగిన గంటల వ్యవధిలోనే దాడి ఘటన చోటు చేసుకోవడం చర్చ నియాంశమై. ఇది కాక ప్రతిరోజు సోషల్ మీడియా వార్త పత్రికలలో అనుమతికి మించి ఇసుక లోడింగ్, అక్రమ రవాణా, నిర్లక్ష్యపూర్వక లారీ రాకపోకల కారణంగా పలు ప్రమాదాలు, ఇసుక లారీల తో ట్రాఫిక్ సమస్య ఇలా ఏదో ఒక విషయంపై మీడియాలో ప్రచారం సాగుతూనే ఉంది. వీటిపై స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు ఫిర్యాదులు ఆందోళనలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఇసుక ర్యాంపుల దందా, అధికారుల నిర్లక్ష్యం, పోలీసు-ఒవెన్యూ శాఖల అప్రతిభపై విస్తృతంగా పోస్టులు వెలువడుతున్నాయి. పలు స్థానిక మీడియా సంస్థలు కూడా ఈ ఆరోపణలపై కథనాలు ప్రసారం చేయడంతో దాడి జరిగిన ఘటన ఆ ఆరోపణలకు ధ్రువీకరణగా నిలుస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

-

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**ముదిగొండ,మహా:** సాయం సంధ్య వేళలో పిక్నిక్ అని ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి ఖమ్మం బయలుదేరిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు,పాప మృతి చెందగా ఒకరు గాయాలపాలైన సంఘటన మండలపరిధిలో పెద్దమండవ రహదారిలో శుక్రవారం రాత్రి జరిగింది.స్థానికుల కథనం ప్రకారం..పెద్దమండవ గ్రామానికి చెందిన పేరం ప్రవీణ్(13),గొర్రెముచ్చు సనా(10),గొర్రెముచ్చు సాయి అనే ముగ్గురు ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై ఖమ్మం బయలుదేరిన, 15 నిమిషాలకు ఊరు బయటికి రాగానే రహదారి పక్కన బాణాపురం గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోట చెట్లను నరికించి మోద్దులను రహదారి పక్కనే వేయటంతో ఖమ్మం నుండి ఇసుక అరలోడు చేసి పెద్దమండవ వెళుతున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి బైకును తప్పించబోయి ఢీకొట్టటంతో బైక్ మీద నుంచి మామిడి తోట మోద్దులు బలంగా తగిలి రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలై ప్రవీణ్ అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు చెప్తున్నారు.సనాకు తీవ్రగాయాలు కాగా, సాయికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వైద్యం కోసం ఆసుపత్రి తరలించగా,పరిస్థితి విషమించి సనా అనే పాప మృతి చెందింది.గాయాలైన సాయికి వైద్యం అందిస్తున్నారు.మృతి చెందిన సనా,సాయి అన్న చెల్లెలు.అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు,కూతురు ఘోరంగా



మృతి చెందటంతో మృతదేహం మీద పడి తల్లిదండ్రులు ఏడుస్తున్న తీరు పలువురుని కంటతడి పెట్టించాయి.గ్రామంలో విషాదం అలుముకున్నది. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు.సరదా చావు ఒడిలోకి చేర్చింది.

FOLLOW: @ANNTELUGU
11-10-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ఆశ్రమ స్కూల్ ముందు డైలీ వేజ్ వర్కర్ల వంటావార్పు

## కారేపల్లి మండలంలో 29 రోజులుగా కొనసాగుతున్న ఆందోళన

**కారేపల్లి, మహా:** తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్, కాంటినెంట్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని మేకల తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ముందు శుక్రవారం వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లంతా ఈ వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రభుత్వం సమస్యను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... డైలీ వేజ్ వర్కర్లంతా 29 రోజులుగా సమ్మె చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్లకు వేతనాలు పెంచాల్సింది పోయి ఉన్న వేతనాల్లో కోతలు విధించడం అన్యాయమని అన్నారు. గతంలో ఇచ్చిన విధంగా రోజువారి వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజువారి వేతనం తగ్గించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. డైలీ వైస్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.



### జిల్లాకో రకమైన జీతాలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్లో పనిచేసే కాంటినింజెంట్ వర్కర్లకు సేమ్ పని ఉంటుందని, అలాంటప్పుడు జిల్లాకో రకమైన జీతం అందిస్తూ వర్కర్ల జీవితాల్లో ఆందోళన సృష్టిస్తున్నారని, ఈ చర్యతో మా జీవితాలు ఇబ్బందులకు గురవుతున్నాయని చెబుతున్నారు. ములుగు జిల్లాలో రూ.21000 వరంగల్ జిల్లాలో రూ.18,600 నల్గొండ జిల్లాలో టైం స్కేల్ వర్తింపజేస్తూ బేసిక్ జీతమే రూ.19000 ఇస్తున్నారని వెల్లడించారు. మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో పనిచేసే కాంటినింజెంట్ వర్కర్లకు మాత్రం రూ. 390 రోజు వారి వేతనం ఇస్తూ, నెలవారీగా రూ. 11700 ఇస్తూ గతంలో వచ్చే జీతాల కంటే తక్కువ ఇస్తుండడంతో జీతం తగ్గిపోయి పని భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,

# తిరుపతికి స్పెషల్ ట్రైన్ నడిపించాలి



**భద్రాద్రి బ్యూరో, మహా:** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం రోడ్డు కొత్తగూడెం నుండి కలియుగ దైవంగా వెరసెలుతున్న తిరుపతి పుణ్యక్షేత్రానికి స్పెషల్ ట్రైన్ రైల్వే అధికారులు ఇచ్చిన హామీ మేరకు వెంటనే నడిపించాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డి ఆర్ యు సి సి మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి కోరారు. భద్రాచలం దైవదర్శనం కార్యక్రమానికి కొత్తగూడెం రైల్వే స్టేషన్ కు స్పెషల్ ట్రైన్ లో వచ్చిన సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాల కృష్ణయ్యని శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డి ఆర్ యు సి సి మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి కలిసి కొత్తగూడెం ప్రాంత రైల్వే సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. కరోనాలో రద్దు చేసిన డోర్నకల్ కాజీపేట ప్యాసింజర్ రైలును తక్షణం పునరుద్ధరణ చేసిన నడిపించాలని కోరారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులు గత అనేక సంవత్సరాలు నుండి నత్త నడక నడుస్తున్నాయని తక్షణం నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు వెయిటింగ్ హాల్స్, వాష్ రూమ్స్, ఎస్కలేటర్ అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం రోడ్ రైల్వే ఏరియా ఆఫీసర్, రైల్వే పోలీస్ అధికారులు, రైల్వే ఇన్స్పెక్టర్, స్టేషన్ మేనేజర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# రద్దుచేసిన రైళ్లు పునరుద్ధించాలి



**కారేపల్లి, మహా :** డోర్నకల్– భద్రాచలంరోడ్ రైలు మార్గంలో కరోనా సమయంలో రద్దుచేసిన రైళ్లను వెంటనే పునరుద్ధించాలని కోరుతూ రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణకు శు క్రవారం సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. కారేపల్లి రైల్వే స్టేషన్ ను డీఆర్ఎం పరిశీలించారు. కరోనా సమయంలో డోర్నకల్– భద్రాచలం రోడ్, మణుగూరు– కాజీపేట జంక్షన్ ప్యాసింజర్ రైళ్లను నేటికీ పునరుద్ధరించలేదని ఆ రైళ్లను పునరుద్ధరించాలని,అలాగే డోర్నకల్ భద్రాచలం రోడ్డు మధ్యలో నడుస్తున్న రైళ్లకు ఈ రైలు మార్గంలో ఉన్న అన్ని స్టేషన్లలో హాల్టింగ్ కల్పించాలని కోరుతూ డీఆర్ఎంకు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు సురేందర్ మనియార్, తురక నారాయణ, బిచ్యా నాయక్, తోగర శ్రీను పాల్గొన్నారు.

# మణుగూరు సిఐపై చర్యలు తీసుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే రేగా డిమాండ్..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సిఐ నాగబాబుపై పోలీస్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం సాయంత్రం మెసేజ్ ల ద్వారా సంచలన కామెంట్లు చేశారు. ఇస్త లారీలు రోడ్లపై ఆపి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే ఇదేమిటనే ప్రశ్నించినందుకు అట్రాసిటీ కేసులు పెడతారా అంటూ ప్రశ్నించారు. ప్రశ్నించిన బాధిత రైతుపై పినపాక ఎమ్మెల్యే అనుచరులు దాడి చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్తా మాఫియా నిర్వాహ కులకు పోలీస్ శాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారన్న విషయం ఈ సంఘటనతోనే తేటతెల్లమైందన్నారు. సిఐ నాగబాబు సమక్షంలోనే ఇసుక ర్యాంపు నిర్వాహకులు దాడి చేసి గాయపరచడం లాంటి సంఘటన సమాజానికి ఏం మెసేజ్ ఇస్తుందన్నారు. రహదారులపై ఇష్టం వచ్చినట్లు లారీలను ఆపితే మేము పోలీస్ స్టేషన్ ముందు బయట ఇస్తామని హెచ్చరించారు. ఇసుక ర్యాంపు బాధితులు ప్రశ్నిస్తే సిఐ సమక్షంలోనే నిర్వాహకులు దాడులు చేస్తారా..? అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తారా..? అని మండిపడ్డారు. ఇప్పటికే మణుగూరు పోలీస్ స్టేషన్ లో మామూళ్ల మత్తుకు ఇద్దరు అధికారులు బలైపోయిన పోలీసుల పేరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సిఐపై చర్య తీసుకుని పక్షంలో పోలీస్ స్టేషన్ ఎదుట బయట ఇస్తామని హెచ్చరించారు.

# సోంపల్లిలో అరుదైన ఘటన



**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ మండలంలో ఒకే కాన్పులో గొర్రె మూడు పిల్లలకు జన్మనివ్వడం పశుపోషణ వర్గాలలో ఆసక్తిని,ఆనందాన్ని కలిగించింది. సాధారణంగా గొర్రెలు ఒకే కాన్పులో ఒకటి, రెండు పిల్లలకు మాత్రమేజన్మనిస్తాయి.మూడు పిల్లలకు జన్మనివ్వడం అనేది చాలా అరుదైన సంఘటనగా పరిగణిస్తారు.?మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన కామిరెడ్డి వెంకటరెడ్డి బూర్గంపహాడ్ మండలంలోని సోంపల్లి గ్రామంలో గొర్రె ల ఫామ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫామ్‌లోని ఓ గొర్రె శుక్రవారం తెల్లవారుజామున అరుదుగా మూడు పిల్లలకు జన్మించింది.మూడు పిల్లలు ఆరోగ్యకరంగా ఉన్నాయని యజమాని తెలి పారు.యజమాని కామిరెడ్డి వెంకటరెడ్డి మాట్లా డుతూ తమ ఫామ్‌లోని గొర్రె ఒకే కాన్పులో మూడు పిల్లలకు జన్మనివ్వడం తమకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని,ఈ అరుదైన జననం గొర్రెల ఫామ్‌కు శుభసూచకంగా భావిస్తున్నా మని ఆయన అన్నారు.ఈ అరుదైన ఘటన సోంపల్లి, మోరంపల్లిబంజర గ్రామాల్లోని చర్చ నియాంశంగా మారింది.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



**జూలూరుపాడు, అక్టోబర్ 10, (మహా):** శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ప్రజా సహకారంతో పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని కొత్తగూడెం డీఎస్పి అబ్దుల్ రెహమాన్ అన్నారు. జూలూరుపాడు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ శుక్రవారం సందర్శించారు. సర్కిల్ పరిధిలోని జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రికార్డులను పరిశీలించారు. ఏడాదికాలంగా ఆయా స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ లో ఉన్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు, అసాంఘిక కార్యక్రమాల పట్ల ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐలకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై బాధావత్ రవి, చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ, అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీట్లు సాధించిన సారపాక విద్యార్థినీలు



**బూర్గంపహాడ్ మహా:** ఇటీవల నీట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్ సీటును సాధించిన బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన పునుగుపాటి రాంబాబు–స్రవంతి దంపతుల కుమార్తె పునుగుపాటి మనస్విని కామారెడ్డి లో ఫ్రీ సీటు సాధించగా , అదే గ్రామానికి చెందిన యారం చంద్రపూర్ణారెడ్డి వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె శ్రావణి నల్గొండలో ఫ్రీ ఎంబిబిఎస్ సీటు సాధించగా శ్రీ వశిష్ట, విద్యాసంస్థల యాజమాన్యం జిల్లా బాధ్యులు, ఏజీఎం ఉపేందర్ రావు, ప్రిన్సిపాల్ నవేంద్ర కుమార్ శుక్రవారం ఘనంగా శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు నర్సాపురం సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

జూలూరుపాడు, అక్టోబర్ 10, (మహా): మండల పరిధిలోని పడమట నర్సాపురం విద్యుత్ సబ్ స్టేషన్ లో శనివారం మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కావున సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని ప్రకటనలో కోరారు.

# మణుగూరులో బీసీ సంక్షేమ సంఘం నిరసన

**మణుగూరు, మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు సోమేశ్వర్ గౌడ్, జీవీ సాంబశివరావులు మాట్లాడారు. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాలని, ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.